క్లుప్తంగా

రేపు నేల బెలుంలో కల్యాణోత్సవం

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే అభిషేకంతో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. కల్యాణం సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో మాఘ మాసం సోమవారం సందర్భంగా శివమాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆటపాటలతో విద్యా బోధన చేయాలి

సంజామల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యా బోధన చేయాలని.. వారిలో మేధా శక్తిని పెంచేలా కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ అన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. పిల్లల్లో మేధాశక్తి, సామాజిక స్పృహ పెంచాలన్నారు. ఇందు కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యనందించాలన్నారు. రీసోర్స్ పర్సన్ శాంత, డీఆర్‌పీలుసురేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రోడ్డు ఏర్పాటుకు వినతి



అధికారులకు సమస్యను విన్నవిస్తున్న బుగ్గానిపల్లె వాసులు

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె దళిత శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు. సోమవారం ప్రజా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ ప్రకాశ్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు ఎద్దుల నాగేంద్ర, మద్దయ్య, లాజర్, సుమంత్, మునిస్వామి పాల్గొన్నారు.

28న జాబ్ మేళా



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

డోన్ టౌన్: స్థానిక జీవీఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. పదో తరగతి ఆపై చదివిన వారు అర్హులన్నారు. వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, అమెజాన్, శ్రీరాజా బ్యాగ్స్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9573108032, 7981238237 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పంచలోహ విగ్రహం వితరణ



విగ్రహాన్ని అందజేస్తున్న దాత కుమారస్వామిరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన కాళికామాత, నాగలింగేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన దాత పంచలోహ జఠాముఖ విగ్రహాన్ని అందజేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుమారస్వామి రెడ్డి రూ. 50 వేలు విలువ చేసే విగ్రహాన్ని సోమవారం ఆలయ అర్చకుడు రాఘవాచారికి అందజేశారు. శివరాత్రి రోజున లింగోద్భవ పూజ తర్వాత స్వామివారికి అలంకరించనున్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగనున్నాయి. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు తరలిరానుండడంతో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో బహుమతులు అందించనున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ భవనం..

కూటమి గ్రహణం

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.కోటి వ్యయంతో నిర్మాణం
- ప్రారంభించి ఏడాదైనా కనీస వసతులు కల్పించని కూటమి ప్రభుత్వం
- రాజకీయ స్వార్థంతో పాత భవనంలోనే కొనసాగింపు
- బ్రిటీష్ కాలం నాటి కార్యాలయంలోనే ఇబ్బందులు పడుతూ ఉద్యోగుల విధులు



వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించి ప్రారంభించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



శిథిలావస్థ భవనంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

డోన్: దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్న చందంగా ఉంది కూటమి ప్రభుత్వ తీరు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.కోటి వ్యయంతో డోన్ పట్టణంలో ఆధునిక వసతులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ఏడాది క్రితం అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజకీయ స్వార్థంతో కార్యాలయాన్ని తరలించకుండా మోకాలడ్డు వేసింది. మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయడం లేదు. 9 నెలలు కావస్తున్నా బ్రిటీష్ పాలనలో నిర్మించిన పాత భవనంలోనే కొనసాగిస్తోంది. ఫలితంగా నూతన భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాత భవనంలో ఉద్యోగులు, అటు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆది నుంచి వివాదాస్పదమే

2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో తమ రియల్ ఎస్టేట్ వెంచర్లకు మంచి డిమాండ్ తీసుకురావాలనే ఉద్దేశంతో స్థానిక టీడీపీ నాయకులు వారి వెంచర్ వద్దనున్న ప్రభుత్వ స్థలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించారు. పక్కనే ఉన్న తమ సొంత స్థలంలో డాక్యుమెంట్ రైటర్ల కోసం 20 గదుల భవన సముదాయాన్ని నిర్మించి ఒక్కో డాక్యుమెంట్ రైటర్ నుంచి అడ్వాన్స్‌గా రూ.30 వేల చొప్పున వసూలు చేశారు. అయితే ఇది పట్టణ శివారు ప్రాంతంలో ఉండడం.. నగదు లావాదేవీల కారణంగా భద్రత ఉండదనే భావనతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో టీడీపీ నాయకుల గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లు అయ్యింది.

నడిబొడ్డున ఆధునిక భవనం

భూముల కొనుగోలు, విక్రయాలు జరిపే వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రెవెన్యూ క్వార్టర్స్‌లో రూ.కోటి వ్యయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధునిక భవనాన్ని నిర్మించింది. ఈ భవనాన్ని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, కార్యాలయాన్ని ఈ భవనంలోకి మార్చేందుకు సుముఖంగా లేకపోవడంతో రూ.కోటి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారింది.

రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం



రూ.కోటితో నిర్మించిన నూతన భవనాన్ని గత ఏడాది ప్రారంభించాం. మౌలిక వసతులైన మంచి నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రహరీ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

–ప్రసాద్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, డోన్

అసౌకర్యంగా ఉంది



ప్రస్తుత భవనం వందేళ్ల కాలం నాటిది కావడంతో శిథిలమైంది. వర్షాకాలంలో విపరీతంగా కారుతోంది. భూముల కొనుగోళ్లు, అమ్మకాలు, తాకట్టు లాంటి వాటికి సంబంధించి రికార్డులన్నీ తడిచిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న భవనం అత్యంత ఇరుకుగా, ఇబ్బందికరంగా ఉండడంతో అధికారులతో పాటు ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు.

–అబ్దుల్లా, డాక్యుమెంట్ రైటర్, డోన్

త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి



రూ.కోటి రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండడం బాధాకరం. నిత్యం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే క్రయ, విక్రయదారులు, దస్తావేజుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా నూతన భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని ప్రజలందరి కోరిక. –నాగార్జున, స్థానికుడు, డోన్.

ఏ భవనంలోకి మార్చినా వెళ్లేందుకు సిద్ధం



నిత్యం 20 నుంచి 30 క్రయవిక్రయాలు, తాకట్టు వ్యవహారాల రిజిస్ట్రేషన్లు ఇక్కడ జరుగుతున్నాయి. ప్రస్తుతం ఒకే గదిలో 10 మందితో పనిచేస్తున్నాం. ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గుర్తించి ఏ భవనంలోకి కార్యాలయాన్ని మార్పు చేయాలని ఆదేశించినా అక్కడికి వెళ్లి విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

–మహబూబ్ బాషా, సబ్‌రిజిస్ట్రార్, డోన్

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవం



నవగ్రహాలకు పూజలు చేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: యాగంటి ఆలయ సమీపంలోని మార్నిళ్ల చెలిమ వద్దనున్న శివాలయ ఆవరణలో వల్లీదేవసేన సమేత సంతాన నవనాగ సుబ్రమణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో ముగిసింది. ఉదయం యంత్రప్రతిష్ఠ, ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, మహామంగళహారతి, మహాపూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. దాతలు హైదారాబాద్‌కు చెందిన సాయినాథ్, స్వప్న దంపతులను యాగంటి ఆలయ మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి సన్మానించారు.

జీవీ కొండారెడ్డి సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: ప్రజా చైతన్య ఉద్యమ నేత కామ్రేడ్ జీవీ కొండారెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. జీవీ 37వ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీ కొండారెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు కరీంబాషా, సీపీఎం నేత సుధాకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పోరాటం కోసం ఎన్నో ఉద్యమాలు చేసి పేదల పక్షాన నిలిచారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని కోవెలకుంట్ల నియోజకవర్గ సాధన, కుందూనది కలుషితం కాకుండా, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు రామచంద్రరాజు, తిరుపాలు, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, ఓబులేసు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక



కోవెలకుంట్ల: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విష్ణువర్ధన్, తేజ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపిక కావడంతో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజయ్య మాట్లాడుతూ..2024 డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు ఏటా రూ. 12వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగేశుడు, ఉపాధ్యాయులు మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్‌రెడ్డి, శ్రీపతి, సుధాకర్‌రెడ్డి, సుగుణ, జహిరాబీ, శైలజ, సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



సంజామల: మధురిమను అభినందిస్తున్న హెచ్‌ఎం

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని మధురిమ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైంది. ఈ నెల 22వ తేదీ విడుదలైన ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. విద్యార్థినిని అభినందించి జ్ఞాపికను అందజేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన కంభం రవి కుమార్, గీత కుటుంబ సభ్యులు రూ.25 వేలు, అలాగే నిత్యాన్నదానం కోసం మరో రూ.10,116 అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. దాతలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగం

బనగానపల్లె: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా డీపీఎం నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో సీనియర్ సైంటిస్ట్ రమణయ్య ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి సాగు ఉపయోగాలను రైతులకు వివరించారు. పలువురు రైతులను సన్మానించారు.

మున్సిపల్ సమావేశంలో వాడీవేడి చర్చ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ సుంకయ్య (ఇన్‌సెట్)మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: కూరగాయల మార్కెట్‌లో అదనంగా కట్టలను నిర్మించాలని అజెండాలో చేర్చడంపై మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో పాటు కౌన్సిలర్లు, కమిషనర్ ప్రసాద్ గౌడ్ మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అదనంగా కట్టలు నిర్మించేందుకు అక్కడ స్థలమే లేదని, ప్రస్తుతం చాలా మంది వ్యాపారులు రోడ్లకు అడ్డంగా కూరగాయలను పెట్టి విక్రయిస్తున్నందు వల్ల కొనుగోలుదారులు అసౌకర్యానికి గురవుతున్నారని సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు టమటం లక్ష్మి, సుకన్య, మేకల విమల, ఇంథియాజ్ ఆక్షేపించారు. దీంతో కమిటీ ఏర్పాటు చేసి అదనంగా కట్టలు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం ఉందా లేదా అని గుర్తించిన తర్వాతనే కట్టలు నిర్మించాలని చైర్మన్ చేసిన సూచనను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

కార్మికులంటే కనికరం లేదా?

తక్కువ వేతనాలతో మున్సిపాలిటీలో ఏళ్లుగా పని చేసి అకాలంగా మృత్యువాత పడ్డ కార్మికుల కుటుంబాలు వీధి పాలైనా ప్రభుత్వానికి కనికరం కలగడం లేదని కౌన్సిలర్లు సుంకయ్య, సాధిక్ అహ్మద్, మల్లికార్జునరెడ్డి, సుంకన్న, వెంకట్రాముడులు కమిషనర్‌ను నిలదీశారు. మృతుల కుటుంబాల్లో ఒక్కరికి మున్సిపాలిటీలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

శవాలను పీక్కుతింటారా?

గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి పట్టణంలో మృతి చెందిన వారికి అంతిమ సంస్కారాల కోసం హిందూ శ్మశాన వాటికలో కేవలం రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తుండేవారని, ప్రస్తుతం రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని కౌన్సిలర్లు మేకల విమల, సుమలత, రత్నమ్మ, స్వర్ణలత, కళావతి ఆరోపించారు. ఈ విధానాన్ని మార్చి కేవలం రూ.వెయ్యి అంతిమ సంస్కారానికి వసూలు చేయాలని సభ్యులు చేసిన సూచనతో కమిషనర్ ఏకీభవించారు. వేసిన రోడ్లపైనే కొత్త రోడ్లు వేసే బదులు, గుంతలమయంగా మారిన మట్టి రోడ్లపై ఎందుకు వేయడం లేదని పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌ను నిలదీశారు. ముఖ్యంగా ఎస్టీ కాలనీలను నిర్లక్ష్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

లక్ష జనాభా ఉన్న పట్టణంలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని కౌన్సిలర్లు నాగేంద్ర, మహేశ్వరరెడ్డి, ఆర్ట్ రమణ, బుర్రు రమాదేవి అన్నారు. 30 మంది పారిశుద్ధ్య కార్మికులను కాంట్రాక్టు విధానంలో తీసుకునేందుకు కలెక్టర్ అనుమతి కోరామని కమిషనర్ వివరణ ఇచ్చారు.

సారా విక్రేత అరెస్టు

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి సోమవారం తెలిపారు. ఆమె వివరాల మేరకు.. మండల పరిధిలోని వలసల గ్రామంలో నాటుసారా అమ్ముతున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. వెంకటరెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తులు

కోవెలకుంట్ల: సామాన్యులు, న్యాయ సేవా సంస్థలకు మధ్యవర్తులుగా వ్యవహరించే పారా లీగల్ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై సంపూర్ణ గ్రహణశక్తితో ఆరోగ్యంగా ఉన్న వారు అర్హులన్నారు. సమాజంలో నిరుపేదలకు సహాయం చేసే వ్యక్తిత్వం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, విద్యార్థులు, లా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత, కులధ్రువీకరణ, చిరునామా, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఇతర వివరాలతో కూడిన బయోడేటాను కోవెలకుంట్లలోని మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం(జూనియర్ సివిల్ జడ్జి కోర్టు)లో అందజేయాలని పేర్కొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



యాగంటిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐలు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఆలయ ఈఓతో కలిసి శుభ్రత, భక్తుల క్యూలైన్, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు తదితర వాటిని పరిశీలించారు. కాగా 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు టోల్‌గేట్ రుసుం వసూలు చేయబోమని ఈఓ తెలిపారు. మంత్రి బీసీ ఆధ్వర్యంలో ప్రతి భక్తుడికి లడ్డూ ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



హరిణి

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ సినిమా థియేటర్ వెనుక వీధిలో నివాసం ఉంటున్న గుద్దేటి హరిణి(23) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు.. ఇదే పట్టణానికి చెందిన షేక్ సాధిక్ ఉసేన్ 2021లో హరిణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి దాంపత్య జీవితం నాలుగేళ్ల పాటు సజావుగా సాగింది. ఇటీవల సాధిక్ ఉసేన్ కోవెలకుంట్లకు చెందిన మరో యువతిని వివాహం చేసుకున్నాడని తెలుసుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో మూడు రోజుల క్రితం భర్త, అత్త, మామలు, అవ్వపై పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి హరిణి ఇంట్లో ఉండగా తల్లి కృష్ణవేణి ఇంటి పక్కవారితో మాట్లాడుతోంది. తమ్ముడు శేఖర్‌రెడ్డి బయటకు వెళ్లాడు. కొంత సమయం తర్వాత తల్లి ఇంట్లోకి వచ్చి చూడగా హరిణి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఆ సమయంలో భర్త ఇంటికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆత్మహత్య చేసుకుందా, భర్తనే చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

బనగానపల్లె రూరల్: ఉపాధి కూలీ గుండెపోటుతో మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని పెద్దరాజుపాళెం గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుమారుడు నవీన్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పి. శ్రీనివాసులు(57) ఎప్పటిలాగే ఉదయం 7.30 గంటలకు గ్రామం సమీపంలో ఉపాధి పనులకు వెళ్లాడు. పని చేస్తుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. పసుపలలోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, ఎఫ్ఏ మురళీమోహన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నారు.

వ్యక్తిపై దాడి

డోన్ టౌన్: మండలంలోని కామగానికుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు రాజ తిమ్మయ్యపై సోమవారం రాత్రి దాడి జరిగింది. పట్టణంలోని పాతబస్టాండ్ వెనుక ఉన్న సీఎస్ఐ చర్చి వద్ద ఉగాది తిమ్మయ్య, మరికొందరు పాతకక్షలతో దాడి చేసి గాయపరిచినట్లు బాధితుని బంధువులు తెలిపారు. తిమ్మయ్యను కర్నూలు వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

- విద్యుత్ షాక్‌తో తలారి మృతి
- రీసర్వే పనులు చేస్తుండగా ప్రమాదం
- కుటుంబ పరిస్థితి దయనీయం

కాటేసిన కరెంటు తీగ



మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు



వైకల్యంతో మంచానికి పరిమితమైన మృతుని పిల్లలు

అవుకు: విద్యుత్... ప్రతి ఇంటిలోనూ వెలుగులు నింపుతుంది. అదే విద్యుత్ ఓ వ్యక్తిని బలి తీసుకుని కుటుంబాన్ని చీకట్లోకి నెట్టింది. అంగవైకల్యంతో నిండిపోయిన ఆ కుటుంబ పరిస్థితిని తలుచుకొని గ్రామం మొత్తం కన్నీరు పెట్టుకుంది. వివరాలు.. అవుకు మండలం ఉప్పలపాడు గ్రామంలో కొద్ది రోజులుగా భూ రీసర్వే పనులు జరుగుతున్నాయి. గ్రామంలో తలారిగా విధులు నిర్వహిస్తున్న తలారి రాముడు(54) పనుల్లో భాగంగా సోమవారం వీఆర్ఓ, సర్వేయర్లతో కలిసి గ్రామ సమీపంలోని పాతశాల వద్ద కానాల లక్ష్మన్న పొలంలో రీ సర్వే పనులు చేపట్టారు. పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. గమనించని తలారి రాముడు సర్వేకు ఉపయోగించే ఓ రాడ్‌ను భుజాన వేసుకొని వస్తుండగా తీగలకు తగిలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అవుకు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహం గ్రామానికి చేరుకోగానే గ్రామం మొత్తం శోకసంద్రంగా మారింది. ప్రభుత్వం తరపున తలారి కుటుంబానికి అండగా ఉంటామని తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

పాపం కుటుంబ పరిస్థితి..



తలారి రాముడు (ఫైల్)

మృతుడు తలారి రాముడుకు భార్య లక్ష్మి పెద్దక్క, ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. ఇందులో పుట్టినప్పటి నుంచే నలుగురు అంగవైకల్యంతో జన్మించారు. చిన్న తనంలోనే ఓ కుమారుడు మృతి చెందాడు. 7 నెలల క్రితం మరో కుమారుడు కిరణ్ కుమార్ మృతి చెందాడు. అంగవైకల్యంలేని కుమార్తెను సమీప బంధువుకి ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం కుమారుడు రవికుమార్(27), కుమార్తె రాజేశ్వరి (25) శాశ్వత అంగవైకల్యంతో మంచానికే పరిమితమయ్యారు. తల్లి ఇంటి వద్దనే ఉంటూ వీరిని చూసుకుంటోంది. ఇంటి పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబ పరిస్థితిని తలచుకొని అయ్యోపాపం అంటూ గ్రామస్తులు కన్నీటిపర్యంతులయ్యారు.



పొలం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న కరెంట్ తీగలు

అధికారుల నిర్లక్ష్యం

పొలాల్లో విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామ ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న పొలాల్లోనే విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపించారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల-నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర పట్టణాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.